కరీంనగర్
సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
శనివారం 25 నవంబర్ 2023 8 పేజీలు






# తెలంగాణకు అన్నంపెట్టే తల్లి సింగరేణి

- అప్పులు తీర్చలేక 49 శాతం వాటా అమ్మింది కాంగ్రెస్ పార్టీయే
- బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రూ.2200 కోట్ల లాభాల్లో సింగరేణి
- తెలంగాణ భవిష్యత్తుతోపాటు రామగుండం భవిష్యత్తు మీ పైనే ఉంది
- రామగుండం ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్




**సూర్య-గోదావరిఖని:**

సింగరేణి సంస్థ తెలంగాణకు అన్నం పెట్టే తల్లి అని, అలాంటి తల్లిని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నిండా ముంచిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సింగరేణి జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు పాలించి అప్పులు తీర్చలేక సింగరేణిలో 49 శాతం వాటాను కేంద్రానికి అమ్మడం జరిగిందని అన్నారు. తండ్రి కొడుకుల ఉద్యోగాలను కూడా కాలరాసింది కాంగ్రెస్ పార్టీయే నని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఉద్యోగాలను పునరుద్ధరించడం జరిగిందని వివరించారు. బొగ్గు గనులే కాకుండా ఇతరత్రా గనుల తవ్వకాలను సైతం త్వరలో సింగరేణి సంస్థ చేపట్టబోతోందని, తద్వారా సంస్థను విస్తరించుకుంటామే తప్ప.. వదులుకోవడంలో రాజీపడమని సీఎం (మిగతా 2లో)

# పెద్దపల్లిలో బీఆర్ఎస్‌కు.. ఎదురుగాలి..?



**సూర్య కరీంనగర్**

పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న దాసరి మనోహర్ రెడ్డికి పరిస్థితులు అనుకూలించడం లేదా..? బిఆర్ఎస్ పార్టీలో నుండి ఇతర పార్టీలోకి భారీ సంఖ్యలో నేతలు కార్యకర్తలు వలస వెళ్లడం, ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో దాసరి కి ఎదురవుతున్న వ్యతిరేకత చూస్తుంటే అవుననే సమాధానమే వస్తోంది. నియోజకవర్గంలో హస్తం గాలివీస్తుండడం పార్టీ క్యాడర్ కారు దిగతుండడం ఆయనను కలవరపెడుతుంది. పెద్దపల్లి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్ రెడ్డి గత రెండు ఎన్నికల్లో మెజారిటీతో గెలిచారు ఈసారి హైట్రిక్ కొట్టి మంత్రి పదవి రేసులో ఉండాలని ఆశపడ్డారు కానీ ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటి నుండి (మిగతా 2లో)




# సిరిసిల్లలో గెలుపు సులువు కాదు..!

- పల్లెల్లో కాంగ్రెస్ పట్టు
- పట్టణంలో బిఆర్ఎస్ హవా.
- చాప కింద నీరులా విస్తరిస్తున్న స్థానికత, పద్మశాలివాదం
- గౌరవప్రదమైన ఓట్ల సాధించేందుకు కృషి చేస్తున్న పద్మశాలి అభ్యర్థులు
- గతంలో కంటే పుంజుకున్న బిజెపి, బీఎస్పీ

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

సిరిసిల్ల నియోజకవర్గంలో గెలుపు ఏ పార్టీకి అంత ఈజీ కాదనిపిస్తుంది. గత ఎన్నికలకు భిన్నంగా ఈసారి పట్టణంలో గట్టి పోటీ నెలకొంది. 89 వేల మెజారిటీతో గత ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించిన మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు ఈసారి అంత మెజారిటీ దక్కేట్టు లేదు. అభివృద్ధి మంత్రం జపిస్తున్న కల్వకుంట్ల తారక రామారావుకు కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి పట్ల ప్రజల సానుభూతి సెగ గట్టిగానే తగిలేట్లు ఉంది. ఏకపక్షంగా ఉందనుకున్నచోట ఎదురీదక తప్పేట్టు లేదు. రాష్ట్రంలోని అత్యధిక అభివృద్ధి చేశామంటున్న సిరిసిల్ల పట్టణంలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి అనుకొని స్పందన ఎదురవుతున్నట్టు కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పట్ల ప్రజలకు మంచి అభిప్రాయమే ఉన్నప్పటికీ స్థానిక నేతల వ్యవహార శైలి తలనొప్పిగా తయారైంది. ముఖ్యంగా సిరిసిల్ల నియోజకవర్గంలోని 114 గ్రామాలలో మెజారిటీ గ్రామాలు కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారుతుండగా ,సిరిసిల్ల పట్టణంలో (మిగతా 2లో)



# తెలంగాణకు అన్నం పెట్టే తల్లి సింగరేణి

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ స్పష్టం చేశారు. నష్టాల్లో ఉన్న సింగరేణిని రూ.2200 కోట్ల లాభాల్లోకి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎన్నికల సభలు జరగవని.. టీవీల్లో నాయకుల చర్చలు విని ప్రజలు ఓ నిర్ణయానికి వస్తారని, మన దేశంలో కూడా అలాంటి విధానం రావాలని ఆకాంక్షించారు. రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే సురక్షితంగా ఉంటుందో ఆలోచించాలని.. దీంతో పాటు అభ్యర్థుల గుణం, గణం, మంచి చెడ్డ చూసి ఓట్లు వేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం, హక్కుల కోసమనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వచ్చామని, రాష్ట్రంలో సంపద పెరుగుతున్న కొద్దీ సంక్షేమ పథకాలకు నిధులు పెంచామని చెప్పారు. కంటి వెలుగు వంటి కార్యక్రమాన్ని ఎవరూ ఊహించలేదని.. రాష్ట్రంలో 3 కోట్ల మందికి కంటి పరీక్షలు చేయించి 80 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని అన్నారు. ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి కింద రూ.లక్ష 116 ఇస్తున్నామని కేసీఆర్గుర్తు చేశారు. రైతుబంధు అనే పదాన్ని గతంలో ఎప్పుడైనా విన్నారా? అని ప్రశ్నించారు. ఈ పథకం పుట్టించిందే బీఆర్ఎస్ పార్టీ ద్వారా మాత్రమే అని, ఈ స్కీమ్ ద్వారా ఇచ్చిన నగదును వృథా చేస్తున్నామని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు 3 గంటల కరెంట్ చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని పేర్కొన్నారు. రైతుల భూమి మీద పూర్తి హక్కులు అధికారులకు కాకుండా రైతులకే కల్పించిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని హర్షం వ్యక్తం చేశారు. ధరణి తీసేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, ధరణి తీసేస్తే.. రైతుబంధు డబ్బులు ఎలా వస్తాయి.. ధరణి తీసేస్తే మళ్లీ దళారులు, లంచాల రాజ్యం వస్తుందని హెచ్చరించారు. రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో 74 రోజులపాటు జైలు జీవితాన్ని గడపడం జరిగిందని, ప్రజల కష్టాలు, నష్టాలు, ఇబ్బందులు తెలిసిన వ్యక్తి ఎమ్మెల్యేగా వస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజల సమస్యలు పరిష్కరించబడతాయనే వాస్తవ విషయాన్ని ప్రజలు గమనించి చందర్ ను మరో మారు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కేసీఆర్ ప్రజలను కోరారు. రామగుండం ప్రాంతంలో బొగ్గు, నీరు పుష్కలంగా ఉండటమే కాకుండా రవాణా మార్గం కూడా ఉండడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉన్న నేపథ్యంలో ఏ పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పితే ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుందో ఆలోచించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్తుతో పాటు రామగుండం భవిష్యత్తు మీ పైనే ఆధారపడి ఉందని, విచక్షణారహితంగా ఓటు వేస్తే గోల్ మాల్ అవుతారని రామగుండం నియోజకవర్గ ప్రజలను కేసీఆర్ హెచ్చరించారు. ఈ సభలో ఎమ్మెల్యే చందర్ తో పాటు పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, టిబిజికేఏస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజిరెడ్డి, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, నాయకులు కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, పిటి స్వామి తదితరులతో పాటు ప్రజలు వేలాదిగా పాల్గొనడం కనిపించింది.

# పెద్దపల్లిలో బిఆర్ఎస్‌కు ఎదురుగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయనకు వ్యతిరేకపవనాలు విస్తున్నాయి ప్రజలలో రోజురోజుకీ వ్యతిరేకత పెరిగిపోతుంది.ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నుండి నాయకులు కార్యకర్తలు ఇతర పార్టీలోకి భారీ సంఖ్యలో చేరుతుండగా కారులో సీట్లు ఖాళీ అవుతున్నాయి. బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తుండగా ఓదెల మండలంలోని అబ్బిడి పల్లి గ్రామంలో దాసరికి నిరసనసెగ తగిలింది. గ్రామానికి చెందిన యువకులతో పాటు ఉపసర్పంచ్ తమ గ్రామంలో సర్పంచ్ నీ ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వం నుండి వచ్చే ప్రోత్సాహ బహుమతి పది లక్షలు ఇప్పటివరకు ఎందుకు అందలేదని ఆ డబ్బులు ఎందుకు రావడం లేదని దాసరిని నిలదీయడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. యువకులు ప్రశ్నించడంతో అక్కడే ఉన్న బిఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సాక్షిగా యువకులపై దాడికి పాల్పడ్డారు ప్రశ్నించిన వారిపై దాడి చేయడం ఎంతవరకు సబబు అని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడంతో దాసరికి ఓటమి తప్పదు అని పలువురు చర్చించుకుంటున్నారు

# సిరిసిల్లలో గెలుపు సులువు కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఓటమిపాలైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డికి ప్రజల నుంచి సానుకూల స్పందన దక్కుతోంది.

**-నేతన్నలే నిర్ణేతలు**

హోరాహోరీగా సాగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో నేతన్నల ఓట్లు కీలకంగా మారుతున్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో 80,000 వరకు పద్మశాలి సామాజిక వర్గ ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పద్మశాలి సామాజిక వర్గం నుండి ముగ్గురు అభ్యర్థులు పోటీ చేస్తుండగా పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ తో పాటు ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి పత్తిపాక సురేష్ లు ఎన్నికల్లో గెలుపొందెందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గత ఎన్నికల్లో పద్మశాలి ఓట్లతో గెలిచిన బిఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల తారక రామారావుకు ఈసారి ఆ సామాజిక వర్గం నుండి నిలబడ్డ అభ్యర్థులు గెలుపు అవకాశాలను గండి కొడుతున్నారు.బీసీ నినాదం, పద్మశాలి సామాజిక వర్గానికి గుర్తింపు, స్థానికత అనే అంశాలతో ఈ ఇద్దరు అభ్యర్థులు తమ సామాజిక వర్గ ఓటర్లను ఆకట్టుకోవడం కోసం ఖర్చుకు వెనకాడకుండా తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఎలాంటి అంచనాలు లేకుండా బరిలో నిలిచిన లెగిశెట్టి శ్రీనివాస్ కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పద్మశాలీలు ఒకవేళ తమ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు ఓట్లు వేస్తే స్థానిక మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు కష్టాలు తప్పేటట్లు లేవు. మరోవైపు బిజెపి అభ్యర్థిగా బరిలో ఉన్న రాణి రుద్రమ కూడా గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధిక పల్లెలు తిరిగిన అభ్యర్థిగా ఆమె రికార్డు సృష్టిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు చేరువ అయ్యేందుకు అలుపెరుగని కృషి చేస్తున్నారు. మరోవైపు బీఎస్పీ నుండి పోటీ చేస్తున్న పిట్టల భూమేష్ కు సహజంగానే ఉండే బహుజన సమాజ్ పార్టీ ఓటు బ్యాంకు తో పాటు ముదిరాజ్ సామాజిక వర్గం ఏకపక్షంగా మద్దతిస్తున్నట్లు సంకేతాలు వస్తున్నాయి.







**-గెలుపులు నిర్ణయించేది ఓట్ల చీలికే**

సిరిసిల్ల పట్టణంలో పద్మశాలి సామాజిక వర్గ అభ్యర్థులతో పాటు బిజెపి, బీఎస్పీ అభ్యర్థులు ఎన్ని ఓట్లను సాధిస్తారనే అంశంపైనే అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి ఉన్నాయి. ముందే చెప్పుకున్నట్టు పల్లెల్లో కాంగ్రెస్ పట్టు కొనసాగిస్తుండగా సిరిసిల్లలో మాత్రం బిఆర్ఎస్ ఆధిపత్యంలో ఉంది. ఈ తరుణంలో ఒకవేళ సిరిసిల్ల పట్టణంలో ఓట్లు చీలి పద్మశాలి సామాజిక వర్గం అభ్యర్థులకు 30 వేలకు పైగా ఓట్లు రాబట్టుకోవడంతోపాటు బిజెపి,బీఎస్పీ అభ్యర్థులు ఎక్కువ ఓట్లను సాధిస్తే కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి గెలుపు అవకాశాలు మెరుగుపడతాయి. అలా కాకుండా సిరిసిల్ల పట్టణంలోని ఓట్లు గతంలో మాదిరిగా ఏకపక్షంగా బిఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల తారక రామారావుకు పడితే గనక ఆయన విజయానికి ఎదురు ఉండకపోవచ్చు. అయితే గతంలో కేవలం 3500 ఓట్లకే పరిమితమైన బిజెపి ఈసారి మెరుగైన ఓట్లు సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరు గెలిచినా స్వల్ప మెజారిటీయే తప్ప భారీ మెజారిటీతో గెలుపొందే అవకాశాలు కనిపించడం లేదు. ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు సిరిసిల్ల నియోజకవర్గంలో అంత ఈజీ మాత్రం కాదు.

# బిజెపి సభలో పవన్ ఫోటో పెట్టక పోవడంపై జనసేన నాయకుల ఆగ్రహం

సూర్య, రాయికల్



రాయికల్ పట్టణంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు.కాగ ఇట్టి సమావేశానికి బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఈటెల రాజేందర్,ఎంపీ అరవింద్ హాజరవ నుండగా,ఇట్టి సమావేశానికి ఎర్పాటు చేసిన ప్లెక్సిలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఫోటో పెట్టక పోవడం పట్ల జనసేన పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపితో జనసేన పార్టీ పొత్తు పెట్టుకుని ప్రచారం నిర్వహిస్తుండగా,ఇట్టి బిజెపి ప్రచార కార్యక్రమం లో జనసేన అధ్యక్షుడి ఫోటో ఎందుకు పెట్టలేదని,ఇది మిత్ర ద్రోహం అని,దీనిని రాయికల్ మండల పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పత్రిక ప్రకటన లో నాయకులు తెలిపారు.

## మీ కంటికి వెలుగునిచ్చిన కారు గుర్తుకే మీ ఓటు వేయండి



"అవ్వలు నేను గుర్తున్నానా.. నేను మీ కంటి డాక్టరు సంజయ్ ని మీ కంటికి వెలుగునిచ్చిన కారు గుర్తుకే మీ ఓటు వేయండి" అంటూ జగిత్యాల బిఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వృద్ధులను వేడుకున్నారు.

సూర్య రాయికల్

# మంథనిలో మంచి వాతావరణం కల్పించేలా కృషి చేస్తున్నా

**- నాలుగేండ్లలో ఎమ్మెల్యేగా అభివృద్ధి చేసి చూపించా - బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్తి పుట్ట మధూకర్**

సూర్య మంథని రూరల్

నాలుగేండ్లలో ఎమ్మెల్యేగా అభివృద్ధి చేసి చూపించాను ప్రజలకు అన్ని సౌకర్యాలుకల్పించే వాడే నాయకుడని మంథనిలో మంచి వాతావరణం కల్పించేలా కృషి చేస్తున్నానని భారత రాజ్యాంగంలో రాసుకున్నట్లుగా ప్రతి మనిషి అన్ని సౌకర్యాలతో మానసిక ప్రశాంతంగా జీవించాన్నట్లుగా మంథనిలో మంచి వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మంథని లో వాకర్స్, ఓపెన్ జిమ్ అసోసియేషన్ సభ్యులతో అల్పాహార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాకర్స్, జిమ్ అసోసియేషన్ సభ్యులుసమిష్టిగా తనను ఆశీర్వదించేందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే బొక్కలవాగును మినీట్యాంక్‌బండ్‌గా, చెక్‌డ్యాం నిర్మాణం, చెరువులు,



గ్రౌండ్‌లను సుందరీకరించి, వాకింగ్ ట్రాక్స్‌లు, లైటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అనేక విధాలుగా మంథని అభివృద్ధికి బాటలు వేశామని తెలిపారు. మంథని ప్రజల అభీష్టం మేరకు ప్రతి వాకింగ్ ఏరియాలో ఓపెన్ జిమ్‌లు, మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తామని చెప్పారు. అలాగే ఔటర్‌రింగ్ రోడ్డు వేసి నాలుగుప్రాంతాలు అభివృద్ధి చేయడానికి ఆలోచనలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనిపెద్దలు చెప్పినట్లుగా మంథని ప్రజలకు మంచి ఆరోగ్యం, మంచి వాతావరణం కల్పించాలన్నదే లక్ష్యమన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఇబ్బందులను అందరం చూశామని, అలాంటి పరిస్థితులు రాకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేలా మంచి వాతావరణం కల్పించేలా దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. నాయకుడంటే ఆకాశం నుంచి ఊడిపడేవాడు కాదని, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానంగా ఉండేవాడని ఆయన వివరించారు. ఇప్పటికే పదేళ్లలో తాను ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించానని ఆయన తెలిపారు. మీ దీవెనలు, ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచి మంథనిని సుందరీకరించి మంచి వాతావరణం కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వాకర్స్, జిమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ శాలువాతో సన్మానించారు.

## ఓళ్ళంతా అభిమానం...



కరీంనగర్ లో గంగుల కమలాకర్ గెలువాలని చెప్పలకు చెందిన మనోహర్ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలు గల ఫ్లెక్సీలు ధరించి ప్రచారం చేశాడు.

సూర్య కరీంనగర్ ప్రతినిధి

# బిజెపి అధికారంలోకి రాగానే కెసిఆర్ కుటుంబాన్ని జైల్లో పెడ్తామ్

## అస్సోమ్ ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వ శర్మ

**సూర్య, చొప్పదండి**



తెలంగాణలో బిజెపి అధికారంలోకి రాగానే సిఎం కెసిఆర్ కుటుంబం అవినీతి పై విచారణ జరిపి జైల్లో పెడ్తామని అస్సోమ్ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వ శర్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చొప్పదండిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.దేశ ప్రధాని మోడీ మీ కోసమే పని చేస్తున్నాడని అన్నారు. ముస్లిం లకు బిఆరెస్,ఎంఐఎం, కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటున్నాయని బిజెపి అధికారంలోకి వస్తే అవి రద్దు చేసి బీసీ లకు రిజర్వేషన్ ఇస్తామన్నారు.రాష్ట్రంలో బీజేపీ అధికారం లోకి వస్తే బీసీ సీఎం వస్తాడన్నారు. అస్సోమ్ లో పెట్రోల్ 97 రూపాయలు మాత్రమే అని తెలంగాణలో 110 రూపాయలు వసూలు చేస్తూ కెసిఆర్ ఇక్కడ దోపిడీ చేస్తున్నాడని విమర్శించారు. బీజేపీ అధికారం లోకి వస్తే పెట్రోల్ రూ,100 లోపు ఇస్తామని తెలిపారు.మా ప్రభుత్వం మంచిది అంటూ కెసిఆర్ పేదలను దోపిడీ చేస్తున్నాడని ఆరోపించారు. పెట్రోల్,డీజిల్,గ్యాస్ తక్కువ ధరకే ఇస్తామన్నారు. ఓవైసీ ఇటీవల పోలీసులను బెదిరించాడని అందుకు బిఆరెస్ ప్రభుత్వం ఉండడమే కారణమన్నారు.ఇదే అసోం లో జరిగితే 5 నిమిషాలలో భరతం పట్టేవడిని అని హేమంత్ అన్నారు. మంద కృష్ణ తో సమావేశం జరిగిందని ఎంఆర్పిఎస్ డిమాండ్ ను 100 శాతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జాన్ 22 న అయోధ్య రామ్ మందిర్ చూడడానికి అందరినీ ఉచితంగా తీసుకు పోతమని తెలిపారు.అసోం లో కూడా 800 మదర్సాలను కాంగ్రెస్ పెంచి పోషించందన్నారు. తమ ప్రభుత్వం మదర్సలను బంద్ చేయించిందని తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో యూసీసీ నీ అమలు చేస్తామన్నారు. ఫిబ్రవరి లో చట్టం తీసుకొస్తాం అన్నారు.మూడు నాలుగు పెళ్ళిలు చేసుకోకుండా చట్టం చేస్తాం అని పేర్కొన్నారు.బిజెపి ప్రభుత్వం వచ్చిన అరు నెలల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.ఏడాది కి నాలుగు సిలిండర్ లను ఉచితంగా అందజేస్తాం అన్నారు. 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని హామీ ఇచ్చారు.కాంగ్రెస్, బిఆరెస్ లు ఒక్కటే అని ఒకరు రిజర్వేషన్ లు ఇస్తానంటే ఒకరు పెండ్లిలకు డబ్బులు ఇస్తామంటున్నారని ఏద్దేవా చేశారు.మేము తెలంగాణ ప్రజల పక్షాన ఉంటామని,ఈ ఎన్నికల్లో బీజేపీ నీ గెలిపించండని విజ్ఞప్తి చేశారు. రామ మందిర నిర్మాణానికి ఆటంకాలు కల్పించారని బీజేపీ అధికారం లోకి రాగానే నిర్మాణం చేపట్టాం అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే మొదటి మంత్రి వర్గ సమావేశం లోనే హైదరాబాద్ పేరు భాగ్య నగర్ గా మర్చుతం అని తెలిపారు. చొప్పదండి బిజెపి అభ్యర్థి బోడిగె శోభను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కృష్ణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యం, పట్టణ అధ్యక్షులు బత్తిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## జమ్మికుంట లో బిఆర్ఎస్ నేతలు విస్తృత ప్రచారం

**సూర్య జమ్మికుంట**

జమ్మికుంట పట్టణంలోని గుల్దార్ మజీద్ ముందు శుక్రవారం నమాజ్ అనంతరం సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి కి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు ప్రచారం నిర్వహించారు ముస్లిం సోదరులను కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేసిన అభివృద్ధి పథకాలు తెలియజేస్తూ పాడి కౌశిక్ రెడ్డి కారు గుర్తుకు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో యండి ఖదీర్,అక్బర్,రస్తుం, రషీద్ ,సలీం, అంకుష,ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో 13వ వార్డు కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్ కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచార జరిపారు బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రతి ఇంటి సభ్యులతో కారు గుర్తుకే ఓటు వేయాలని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే హుజరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ని గెలిపించాలని కోరారు పట్టణంలోని ఆరవ వార్డులో కౌన్సిలర్ శ్రీపతి నరేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచార నిర్వహించారు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు కొత్తపల్లిలో 20 వ వార్డులో కౌన్సిలర్ దేశిని రాధా సదానందం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. టిఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు ఈ కార్యక్రమంలో దీటి ధర్మేందర్ కొమ్ము రాజు, బూరుగుపల్లి నాగరాజు, కొమ్ము రాజయ్య, ఎగితే మహేందర్ ఎగితే శంకర్ , ఎన్నారెడ్డి కవిత ఓలాల రాకేష్ హరీష్ బైరవేణి రమేష్, కబీర్, బిక్షపతి,బన్నీ కార్యకర్తలు పాల్గొన్నారు

## పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక

**సూర్య, హుజురాబాద్**



టిఆర్ఎస్, బిజెపి, వైఎస్ఆర్సిపి పార్టీలకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం తమ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హుజురాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వొడితల ప్రణవ్ స్వగృహంలో పార్టీ లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి హామీని నెరవేర్చేందుకు పాటుపడతానని హామీ ఇచ్చారు. హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన తెలిపారు. పార్టీలో చేరిన వారిలో టిఆర్ఎస్ నాయకులు చందమల్ల బాబు, దుబాసి బాబు, టేకుల శ్రావణ్, బిజెపి నాయకులు విఆర్ గౌడ్, వైఎస్ఆర్సిపి నాయకులు చందమల్ల నరేష్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం

**సూర్య కరీంనగర్ రూరల్**



కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో కరీంనగర్ నియోజకవర్గ యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, గ్రామ యూత్ అధ్యక్షుడు కొక్కు భరత్ ఆధ్వర్యంలో గ్రామంలోని 35వ బూతులో గడపగడప ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో చందు మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గం అభివృద్ధిని చూసి నియోజకవర్గ ప్రజలు సంతోషపడుతున్నారు అని, గంగుల కమలాకర్ ను నాలుగోసారి మళ్లీ గెలిపించుకుంటామని ఆపదలో సంపదలో ముందుండే వ్యక్తి గంగుల కమలాకర్ ని, ప్రజలు అంటున్నారని అన్నారు. నవంబర్ 30 వ తారీఖు నాడు జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి కరీంనగర్ నియోజకవర్గం బి ఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూన రంజిత్ , పందగ శ్రావణ్, పల్లాటి నవీన్, కూన అంకుస్, నవీన్, గంభీరావుపేట రాజేశం , గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత..

### - ఇద్దరిపై కేసు నమోదు.. - ఎక్సైజ్ అక్బర్ హుస్సేన్ .

**సూర్య ఇల్లందకుంట:**



అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు పక్క సమాచారం మేరకు ఇద్దరు నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎండి అక్బర్ హుస్సేన్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మరి పెల్లి గూడెం గ్రామానికి చెందిన తోట యాదగిరి అనే వ్యక్తి ఇల్లందకుంట మండలం నుంచి తన గ్రామానికి అక్రమంగా 5.25 లీటర్ల మద్యం బాటిల్లను రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారంతో తెలుసుకొని వారిపై దాడి చేసి మద్యం పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసి అక్రమ మధ్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు అలాగే జమ్మికుంట గ్రామానికి చెందిన సుద్దాల ఎల్లమ్మ తన ఇంటి దగ్గర అక్రమంగా గుడాంబా అమ్ముతున్నట్లు పక్కా సమాచారంతో పట్టుకొని ఐదు లీటర్ల గుడుంబాను సీజ్ చేసి ఆమెపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు ఎన్నికల కోడ్ కు నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ మద్యం సరఫరా చేసిన నిల్వ ఉంచిన గుడుంబా వ్యాపారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమాదేవి కబీర్దాస్ కానిస్టేబుల్స్ పెద్దన్న మహేష్ మౌనిక రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ ను అడ్డుపెట్టుకొని బిజెపి నాటకం

**సూర్య, హుజురాబాద్**




అధికారంలో ఉన్న అన్ని రోజులు వర్గీకరణ బిల్లును తొక్కి పెట్టిన బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మందకృష్ణను అడ్డుపెట్టుకొని బిజెపి నాటకం ఆడుతుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఇమ్మడి దయాకర్ అన్నారు. శుక్రవారం ఆయన హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 9 సంవత్సరాలు అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదని అన్నారు. ఎన్నికలు రావడంతో మాదిగలను మభ్యపెట్టడం కోసం మందకృష్ణను బిజెపి పార్టీ అడ్డం పెట్టుకొని ఎస్సి ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆయన అన్నారు. బిజెపి చేస్తున్న కుటిల ప్రయత్నాన్ని ప్రజలందరూ గమనించాల్సింది ఆయన అన్నారు. ఎస్సీలు అభివృద్ధి చెందారంటే అది కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి అని చెప్పాలనీ, ఇందిరమ్మ ఇండ్లు, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అందుకే హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితెల ప్రణవ్ ని గెలిపించాల్సిందిగా కోరుతున్నాం అని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సొల్లు బాబు, బీసీ సెల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ కుర్ర శ్రీనివాస్ గౌడ్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు యేముల పుష్పలత, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలీ కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకుంటాం

**సూర్య, హుజురాబాద్**



ఇటీవల కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరై ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ పై నుంచి పడి గాయపడి మృతి చెందిన మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదంలో వీణవంక మండలానికి చెందిన ఉడుత స్వరూప గాయపడి మృతి చెందిందని, సంఘటన వివరాలు తెలియగానే వెంటనే గురువారం రాత్రి హన్మకొండలోని ఆమె చికిత్స ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వచ్చానని అన్నారు. కుటుంబానికి అన్ని రకాల సహాయం చేస్తానని ఆయన తెలిపారు. కొంత మంది కావాలని ఈ సంఘటనపై తనపై బురద చల్లుతున్నారని ఆయన అన్నారు.

## బిజెపి పార్టీ నుండి బిఆర్ఎస్ లో చేరికలు

**సూర్య, వీణవంక**



వీణవంక మండల పరిధిలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు చాడ రాజేందర్ రెడ్డి తో పాటుగా సుమారు 50 మంది రాష్ట్ర హోమ్ మినిస్టర్ మొహమ్మద్ అలీ, బిఆర్ఎస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరుగుతుందని తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పాడి కౌశిక్ రెడ్డితోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎక్కటీ రఘుపాల్ రెడ్డి, ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, కామెడీ శ్రీనివాస్ రెడ్డి, జీడి వెంకటస్వామి, పోరెడ్డి తిరుపతి రెడ్డి, వీరబోయిన శ్రీనివాస్, వీరితో పాటుగా ఎలుక హరినాథ్ రెడ్డి, ముత్తిరెడ్డి రాజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వడ్డేపల్లి సదానందం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల దాహార్తి తీర్చిన స్థానిక దాతలు

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత విద్య అభ్యసించి జర్మనీలో ఉద్యోగం చేస్తున్న మహాత్మానగర్ కు చెందిన విజయ, వెంకటపతి పటేల్ కుమారుడు వంశీకృష్ణ, వారి సతీమణి నిధి ఎల్ఎండి కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీటి కొరకుఅర్. ఓ. ప్యూరిఫైడ్ 40 వేలతో సమకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాల పక్షాన కుటుంబ సభ్యులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజభాను చంద్ర ప్రకాష్ ,సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.



# అభివృద్ధి.... సంక్షేమం చూసి ఆశీర్వదించండి

## కోరుట్ల బి ఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్

సూర్య -కోరుట్ల

తెలంగాణ రాష్ట్రంతో పాటు కోరుట్ల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని చూసి తమను ఆశీర్వదించాలని కోరుట్ల నియోజకవర్గం ప్రజలను బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పథకాల ను చూసి ప్రజలు టిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు 10 హెచ్పి కరెంటు మోటార్ల కు మూడు గంటలే సరఫరా సరిపోతుందని అనడం రైతులను మోసం చేయడమే అన్నారు. అలాగే కేంద్ర మంత్రి నిర్మల సీతారాం తెలంగాణలో మోటార్లకు మీటర్లను పెట్టుకోకపోవడంతో తెలంగాణకు నిధులను కేటాయించలేమని చెప్పడం చాలా బాధాకరమని డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు 24 గంటల కరెంటును ఉచితంగా ఇచ్చి రైతుల



సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అలాంటి సీఎం కెసిఆర్ ను కోరుట్ల నియోజకవర్గ బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్ ఇష్టం వచ్చినట్లుగా బూతులు తిట్టడం సరికాదన్నారు 71 సంవత్సరాల కేసీఆర్ను చనిపోతే బీమా ఇస్తామనడం సిగ్గుచేటని ,బిజెపి పాలిత ప్రాంతాలలో ఏ రాష్ట్రంలో కూడా 24 గంటల కరెంటును ఇవ్వడం లేదని అలాగే ఆసరా పెన్షన్లు కూడా ఏ ఒక్క రాష్ట్రంలో ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలను మోసం చేయడానికి అన్ని పథకాల ను అమలు చేస్తామని ప్రలోభాలకు గురి చేస్తున్నారని అన్నారు. కోరుట్ల నియోజక వర్గంలో ఇప్పటివరకు ప్రజలు శాంతియుతంగా ఉన్నారని ఎవరి పనులు వారు చేసుకుంటూ అన్ని పార్టీలతో కలుపుకొని ప్రజలు 15 సంవత్స రా ల నుండి ఉన్నారని బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అరవింద్ వచ్చినప్పటి నుండి కోరుట్లలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అల్లర్లు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఎంపీ గా ఉన్న వ్యక్తి సంస్కార హీనమైన మాటలు మాట్లాడడం సరియైన ది కాదన్నారు. ఎన్నికలు వస్తాయి పోతాయి ఏ పార్టీ అభ్యర్థి అయిన ఎన్నికల్లో కొట్లాడాలి కానీ ప్రజలను దూషించి అల్లర్లు సృష్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటివరకు కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కృషితో ఎంతో అభివృద్ధి జరిగిందని, ఇంకా చేయాల్సి ఉందని మరింత అభివృద్ధి జరగాలంటే తనను నియోజకవర్గ ప్రజలు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించినట్లయితే నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి నారాయణరెడ్డి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాయకులు బలిజ రాజారెడ్డి సాయిని రవీందర్, గుడ్ల మనోహర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




### గడపగడపకు ఎన్నికల ప్రచారం

సూర్య- కోరుట్ల



ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 16వ వార్డులో మసీదుల వద్ద మైనారిటీల తో పాటు గడపగడపకు వార్డు కౌన్సిలర్ బలిజ పద్మ- రాజారెడ్డిలు తిరుగుతూ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ నీ భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ టిఆర్ ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసుల చిన్నయ్య, ఉయ్యాల శేఖర్ ,బలిజ సంతోష్ కుమార్ ,కటకం ఓం ప్రకాష్, బలిజ రాజా శేఖర్, మహిళలు పాల్గొన్నారు.



### బీఆర్ఎస్ లో నయా జోష్

#### సుంకె రవిశంకర్ సమక్షంలో భారీగా చేరుతున్న యువత

సూర్య కొడిమ్యాల

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 300 మంది యువత శుక్రవారం రోజు బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా అభ్యర్థి సుంకె రవిశంకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక బిడ్డనైన నేను అందరికీ అందుబాటులో ఉంటున్నానని అన్నారు. మరొకసారి గెలిపించుకుంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ 15 లక్షల వరకు పెంచడం జరుగుతుందని అన్నారు. అన్నపూర్ణ పథకం ద్వారా తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యమైందని అన్నారు. కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమం లో సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగారావు, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సంగెం, కల్లూరు లో బిఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

సూర్య కోరుట్ల రూరల్

బిఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కు మద్దతుగా కోరుట్ల మండలం లో ని సంగెం, కల్లూరు గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ అభ్యర్థి శ్రీ కల్వకుంట్ల సంజయ్ సతీమణి కలవకుంట్ల దీప్తి, సమతమ్మ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించడం జరిగింది. గ్రామాలలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చేసిన అభివృద్ధిని తెలుపుకుంటూ, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఇంకా చేసే అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు తెలుపుతూ ఓట్లు అభ్యర్థిచ్చారు . ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లావణ్యరాజేష్, వైస్ ఎంపీపీ స్వరూప సంగెం సర్పంచ్ చెప్పాల నరసయ్య ఉప సర్పంచ్ సాగరిక శంకర్ బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు సుధావేణి భూమయ్య మహిళా మండలి సభ్యులు, కల్లూరు సర్పంచ్ వనతడుపుల అంజయ్య ఉపసర్పంచ్ రాకేష్ , గ్రామ శాఖ అధ్యక్షులు గంగాధర్ మహిళలు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### నమూనా బ్యాలెట్ యూనిట్ తో ఓటర్లకు అవగాహన

సూర్య కోరుట్ల



పట్టణంలో విలీన గ్రామమైన ఏ కిన్ పూర్ 6వ, వార్డులో శుక్రవారం బి.ఆర్.ఎస్ నాయకులు నమూనా బ్యాలెట్ యూనిట్ తో ఓటు వేసే విధానాన్ని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు వివరిస్తూ, సీఎం కేసీఆర్ తెలంగాణ లో ప్రజలకు చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. అలాగే కోరుట్ల నియోజకవర్గం బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ని ఈ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాల తో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, మరింత అభివృద్ధి జరగాలంటే డాక్టర్ సంజయ్ ని భారీ మెజార్టీతో గెలిపించుకున్నట్లయితే నియోజకవర్గం రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గం గా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశిరెడ్డి మోహన్ రెడ్డి, కౌన్సిలర్ బద్ది సుజాత -మురళి నాయకులు నల్ల మల్లేష్ రెడ్డి ,వరి కంటి సాగర్, పుటుకపు నర్సారెడ్డి, జిన్న గంగనరసయ్య ,బద్ది అభిమన్యు ,చొప్పరి శంకర్, పుటుకపు నరసారెడ్డి, తోపారపు నరసయ్య, బద్ది నరేష్, ఎర్ర విక్రం బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### సంజయ్ ని ఆశీర్వదిద్దాం

#### మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్

సూర్య,కోరుట్ల టౌన్



ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ని ఆశీర్వదిద్దామని జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ అన్నం లావణ్య అనిల్ మహిళా సంఘాల సభ్యురాలను కోరారు. పట్టణంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి చైర్పర్సన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల పక్షపాతని అన్ని సంక్షేమ పథకాలు మహిళలకు అందిస్తున్నారని తెలిపారు. కోరుట్ల నియోజకవర్గం లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చేసిన అభివృద్ధి మరువలేనిదని అన్నారు. ఈ ఎన్నికల్లో అందరికీ అందుబాటులో ఉండే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిద్దామని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను నమ్మి మోసపోకూడదని, మతాల మధ్య చిచ్చుపెట్టే వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి చేయాలని కోరుకుంటున్నారని, మనమందరం కారు గుర్తుపై ఓటు వేద్దామని అన్నారు. ఈ సమావేశంలో 16వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మ, కో ఆప్షన్ సభ్యురాలు రేంజర్ల కళ్యాణి ,మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేద అనాథ యువతకి ఆర్థిక సాయం చేసిన పాఠశాల కరస్పాండెంట్

సూర్య, రాయికల్



రాయికల్ పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సంధ్యా అనే యువతి వివాహానికి మానవత్వానికి మించిన సాయం మరొకటి లేదంటూ ముందుకు వచ్చి యువతి వివాహ ఖర్చుల నిమిత్తం విశ్వశాంతి హై స్కూల్ అధినేత మచ్చ గంగాధర్ అండగా నిలిచి పది వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. సందర్భంగా యువతి బంధువు మాట్లాడుతూ అమ్మ నాన్న లు మరణించడంతో అనాథగా పేదరికంలో ఉన్న యువతి కి స్వచ్ఛందంగా ఎలాంటి లాంఛనాలు లేకుండా వివాహం చేసుకుంటానని ఓ యువకుడు ముందుకు రావడంతో,పెళ్లి చేయ నిర్ణయించామని వివాహ ఖర్చుల నిమిత్తం దాతల ఆర్థిక సహాయం కోరి ఉన్నామని మానవత్వంతో దాతల పెండ్లి ఖర్చుకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. మానవత్వంతో స్పందించిన మచ్చ గంగాధర్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ కుంట్ల జగదీశ్వర్,పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

### పీజీ,ఎం.కామ్ పరీక్ష ఫలితాలలో రామకృష్ణ విద్యార్థుల విజయకేతనం

సూర్య,కోరుట్ల టౌన్



శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన పీజీ రెండవ,నాల్గవ సెమిస్టర్ ఎం కామ్ పరీక్ష ఫలితాలలో కోరుట్ల రామకృష్ణ పీజీ కళాశాల విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగురవేశారు. ఎం కామ్ కంప్యూటర్స్ రెండవ సెమిస్టర్ విభాగంలో పిట్టల వందన 7.38 జిపిఏ , రాణవేణి శృతి 7.02 జిపిఏ , ఎం కామ్ కంప్యూటర్స్ నాలుగవ సెమిస్టర్ విభాగంలో చింతామణి కావ్య శ్రీ 7.26 సిజిపిఏ ,ఆదే రజిని 6.98 సిజిపిఏ ,దానవేణి వందన 6.9 సిజిపిఏ ,ఎం కామ్ జనరల్ రెండవ సెమిస్టర్ విభాగంలో కొత్తూరి మనీషా 6.88 జిపిఏ, కటుకం నవ్య 6.68 జిపిఏ , ఎం కామ్ జనరల్ నాలుగవ సెమిస్టర్ విభాగంలో పేట శుభ దర్శిని 6.58 సిజిపిఏ సాధించి యూనివర్సిటీలోనే ఉత్తమ ఫలితాలను సాధించారు .కాగా ఉత్తమ జిపిఏ,సిజిపిఏ సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ ,డైరెక్టర్లు గాడిపెల్లి హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్ అధ్యాపక బృందం అభినందించారు.

### పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

సూర్య, కోరుట్ల టౌన్

శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని వివిధ వార్డులలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు డ్రైనేజ్ ను క్లీన్ చేస్తూ, పొదలను కూడా తొలగించడం జరుగుతుంది. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శివారు ప్రాంతంలో ఉన్నటువంటి కాలనీలలో డ్రైనేజ్ ను క్లీన్ చేస్తూ, పొదలను తొలగించడం జరుగు తుది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ .రాజేశ్వర్,సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ పాల్గొనడం జరిగింది.

# పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దింది బిఆర్ఎస్ ప్రభుత్వం

## -పల్లె పచ్చగుండాలంటే కారుకే మీ ఓటు వేయాలి -ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**సూర్య, రాయికల్**

గ్రామీణ పల్లెలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి పథంలో నడిపించింది కేవలం తెలంగాణ ప్రభుత్వమేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.రాయికల్ మండలం కురుమపల్లి, శ్రీరామ్‌నగర్, సింగరావు పేట, అల్లిపూర్,కిష్టంపేట గ్రామాల్లో శుక్రవారం బిఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత పది ఏళ్ల క్రితం పల్లెలు ఎట్లా ఉండే,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పల్లెలు ఎట్లా అభివృద్ధి చెందాయి ప్రజలు గమనించాలన్నారు.ప్రతి గ్రామంలో ప్రజలకు కరెంటు కష్టాలు లేకుండా ఉండేందుకు విద్యుత్ ట్రాన్స్?ఫార్మర్లు,కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసామన్నారు.గత ప్రభుత్వాలు పేదలు, రైతుల కోసం చేసింది ఏమీ లేదన్నారు.తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలు, రైతుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారనీ ,రైతుబంధు, రైతు బీమా,కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్,కెసిఆర్ కిట్టు,సీఎం సహాయనిధి, బీడీ



పెన్షన్,ఆసరా పెన్షన్ల ద్వారా ఊరూరా అర్హులైన వారందరికీ వందల సంఖ్యలో పెన్షన్లు ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వం బిఆర్ఎస్ సర్కార్ అన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ కు పేద కష్టాలు తెలుసు కాబట్టి దేశంలోనే ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.అర్హులైన వారికి ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ సర్కార్ పెన్షన్లను, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను,దళిత,బీసీ బందులను అందిస్తుం దన్నారు. అర్హులైన మహిళలందరికీ సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా నెలకు 3000 రూపాయలను అందిస్తామన్నారు. సిలిండర్ ధరను తగ్గించి 500 కే మహిళలకు సిలిండర్లు అందిస్తామన్నారు. ఒకప్పుడు రైతులు కరెంటు, ఎరువులు, విత్తనాల కోసం ఎంతో ఇబ్బందులు పడ్డారనీ,కానీ తెలంగాణ రాష్ట్రంలో నేడు ఆ పరిస్థితి లేదన్నారు.రాత్రి వేళల్లో పొలాలకు నీళ్లు పెట్టేందుకు రైతులు పొలాల వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా బిఆర్ఎస్ సర్కార్ చేసిందన్నారు.అలాగే రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలు అందుతున్నాయి అన్నారు. 24 గంటల కరెంటు వల్ల నేను తెలంగాణలో రైతులు మూడు పంటలు పండిస్తున్నారన్నారు. తెలంగాణ రైతులు దేశానికి అన్నం పెట్టే విధంగా తయారయ్యారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి వడ్లు కొనంటే రైతుల పక్షాన ఢిల్లీకి వెళ్లి ధర్నాలు చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీది అన్నారు..వైద్యుడిగా ఎమ్మెల్యేగా నిత్యం ప్రజల మధ్యలో ఉండి సేవ చేస్తున్న తనకు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మద్దతు తెలిపి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అశ్విని జాదవ్,సింగిల్ విండో చైర్మన్ యాదవనేని రాజలింగం యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేష్ యాదవ్, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేశ్వర్లు,మండల కో ఆప్షన్ సభ్యులు మోకిద్, సర్పంచులు రామచంద్ర రావు, రాజమల్లు, గంగారం,మండల గ్రామ నాయకులు మహేష్, సాగర రావు, కార్యకర్తలు ప్రజలు ,యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హమాలి అన్నదమ్ముల ఆశీర్వాదమే అభివృద్ధికి బాట వేస్తది

**- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

**సూర్య మంథని రూరల్**



ప్రజల అవసరాలు తీర్చే బాధ్యత నాదే ప్రతి దినం కష్టపడిరక్తాన్ని చెమటగా దారపోస్తున్న కష్టజీవులు నా హమాలి కార్మికు అన్నదమ్ముల ఆశీర్వాదం ఆదరణ మంథని అభివృద్ధికి బాటలు వేస్తుందని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు.శుక్రవారం మంథనిపట్టణంలోని లోని హమాలీ కార్మికులను ఆయన కలిసి కాసేపు మాట్లాడారు. ఉదయం వాకింగ్ అనంతరం హమాలీ సంఘ కార్యాలయంలో కార్మికులను కలిసి బీసీ బిడ్డగా తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. నాలుగేండ్లు ఎమ్మెల్యేగా మంథని ప్రజల కష్టాలు తీర్చారని, అనేక సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా హమాలీ కార్మికుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకు న్నానని, కష్టపడి పనిచేసే వాళ్లను ఎక్కువగా ఇష్టపడుతానని అన్నారు. మంథ ని ప్రజల అవసరాలను తీర్చే బాధ్యత నాదేనని, మరోమారు అవకాశం కల్పిం చి ఆదరించి ఆశీర్వాదం అందించాలని ఆయన హమాలీ కార్మికులను కోరా రు. కార్యక్రమంలో హమాలి కార్మికులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## బి ఆర్ ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని రాఘవపూర్ గ్రామంలో బీ ఆర్ ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారంలో మన కేసీఆర్ కారు గుర్తు కు ఓటు వేయాలని, పెద్దపల్లి ఎమ్మెల్యే గా దాసరి మనోహర్ రెడ్డి ని గెలిపించాలని కోరారు. రైతుకు ఎకరానికి రూ. 16వే లు, దివ్యాంగులు పెన్షన్ రూ. 6వేలు, వితంతు పెన్షన్ రూ. 3వేలకు పెంచడం తో పాటు ప్రతి ఏటా రూ. 500 పెంచి రూ. 5 వేలను అం దిస్తారని వివరించారు. తెల్ల రేషన్కార్డు ఉన్న వారందరికి 5 ల క్షల బీమా పథకం, సన్నబియ్యం అందిస్తామన్నారు. తొమ్మిదే ళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని తెలుపుతూ ఓట్లు అ భ్యర్థించారు. టిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ మార్కు లక్ష్మణ్ గ్రామ అధ్యక్షుడు కొమురయ్య మాజీ అధ్యక్షుడు చెంద్రయ్య, తాడిశెట్టి శ్రీకాంత్, డొంకన రమేష్ , శంకర్ , మల్లయ్య , సదయ్య, లక్ష్మయ్య, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ

**సూర్య జగిత్యాల**



జగిత్యాలలో ఆదివారం సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచా రం ఉండగా బహిరంగ సభ స్థలిని ఏర్పాట్లును ఎమ్మెల్సీ ఎల్.రమణ,జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ శుక్రవారం పరిశీలించారు.. వారి వెంట ,మహిపాల్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ ఎల్లా రెడ్డి,రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం,రైతు బంధు సమితి మండల కన్వీనర్ నక్క రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ అసిఫ్,నాయకులు రాంమోహన్,శరత్ రావు,ఉత్తమ్,సుమన్ రావు తదితరులు ఉన్నారు.

## ఏడుసార్లు గెలిచిన ఈటల రాజేందర్ ఇక్కడ ఏం చేశారు

**-కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు**

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ నియోజకవర్గం నుండి ఏడు సార్లు గెలుపొంది రెండు సార్లు మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ ఈ ప్రాంతానికి ఏం చేశాడని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు అన్నారు. శు క్రవారం హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రచారం జరిపారు. శివాలయం వద్ద కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ఎన్నికల సందర్భంగా ఈటల రాజేందర్ ఆయన సతీమణి ఈటల జమునా రెడ్డిలు సాదుకుంటారో..... సంపుకుంటారో.... అని సెంటిమెంటు ప్రజల్లో రగిలించారని, ప్రజలు సైతం పోనీలే అని మళ్ళీ గెలిపిస్తే ఈటల రాజేందర్ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు ఎందుకని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా నిధులను తీసుకు రాలేదని అన్నారు. కనీసం ఆయన సొంత మండలంలోని ఉప్పల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని సైతం పూర్తి చేయలేని వ్యక్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెబితే ప్రజలు నమ్ముతారా అని ఆయన ప్రశ్నించారు. ఇక్కడే పుట్టానని, ఈ మట్టి బిడ్డనని, మీ కష్టాలలో తోడుంటా హుజురాబాద్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మీ కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని ఆయన అన్నారు. నేను మీలో ఒక్కడిని మీ ఇంట్లో కొడుకు లాగా ఆదరించాలని, మీతో పాటు మీ కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించింది, ప్రజలకు చేసింది ఏందని ప్రశ్నించారు. మేనిఫెస్టో రూపొందించిన తర్వాత మేము నిర్ణయించిన 500 గ్యాస్ సిలిండర్ ధరను 400 కి ఇస్తాను అనడం విడ్డూరంగా ఉందన్నారు. గత పదెల్లుగా అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని సిలిండర్ ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చింది ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి మనం బహుమానంగా ఇచ్చేది కాంగ్రెస్సే అని అన్నారు. మాటిచ్చి నెరవేర్చేతత్వం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని మీ ఇంటికి చేర్చే బాధ్యత తీసుకుంటానని మాట ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని, 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇంటికి అందిస్తామని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం గడ్డమీద ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సొల్లు బాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వై. పుష్పలత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడూరు స్వామి రెడ్డి, కే. శీను, తోట రాజేంద్రప్రసాద్, బాబు, నరేష్, సూర్య, కిరణ్ బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టిఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం

**సూర్య,మెట్ పల్లి టౌన్**



మెట్పల్లి మండలం చౌలమద్ది గ్రామంలో కోరుట్ల నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు కల్వకుంట్ల సంజయ్ కి మంగళ హారతులు ఆహ్వానమిచ్చారు. అనంతరం సంజయ్ గ్రామంలో పర్యటిస్తూ కేసిఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను వివరిస్తూ నేను మీ ఊరి బిడ్డను, ఇక్కడే ఉండి మీకు సేవ చేసుకునే భాగ్యం నాకు కల్పించాలని ప్రజలను కోరారు. మీ కష్టాలు, కన్నీళ్లను చూసిన వాన్ని, మీకు ఏది అవసరం తెలిసిన వాన్ని, ఇప్పటికి కోరుట్ల నియోజకవర్గాన్ని మా తండ్రి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఎంతో అభివృద్ధి చేశాడని, మరింత అభివృద్ధి కోసం నన్ను అధిక మేజారిటితో గెలిపించాలని, గెలిచిన తర్వాత చేసే పథకాల గురించి వివరిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌలమద్ది సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ లో చేరిక

**సూర్య, మెట్ పల్లి టౌన్:**

పట్టణంలో ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం, ఎర్దండి గ్రామాల కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ లో చేరారు. ఇబ్రహీంపట్నం మండలం, ఎర్దండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కున రాకేష్ మరియు కొత్తూరు గ్రామానికి చెందిన చలిగంటి నర్సయ్య వారి అనుచరులతో కలిసి ఈ రోజు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## జిల్లా ఏర్పాటుకు సహకరిస్తామన్న రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ కేంద్రంగా మాజీ ప్రధాని పివి పేరుతో జిల్లా ఏర్పాటు కోసం జరుగుతున్న ఉద్యమానికి అండగా నిలుస్తున్న రాజకీయ పార్టీలకు హుజురాబాద్ పివి జిల్లా సాధన కమిటీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఏర్పాటుకు సహకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ బీఎస్పీ తెలంగాణ జన సమితి నాయకులు చెప్పడం పట్ల హర్షనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పివి జిల్లా సాధన జేఏసి కమిటీ కన్వీనర్ భీమోజు సదానందం, స్టీరింగ్ కమిటీ సభ్యులు పొడిశెట్టి వెంకటరాజం, వేల్పుల రత్నం, పులి జగన్నాథం, ఆలేటి రవీందర్, ఈదులకంటి రవీందర్ రెడ్డి, తాటిపల్లి రాజన్న, అంతం రాఘవరెడ్డి, రఫీక్ తదితరులు హర్ష%శీ% వ్యక్తం చేశారు.

## గీతా కార్మికులకు అండగా నిలిచింది బిఆర్ఎస్

**-మాజీ మంత్రి రాజేశం గౌడ్**

**సూర్య,రాయికల్**



గీతా కార్మికులకు ఎల్లవేళలా అండగా నిలిచి ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ అన్నారు. రాయికల్ మండలంలోని తాట్లవాయి, చింతలూరు, వడ్డే లింగాపూర్ గ్రామాల్లో బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. గీతా కార్మికులకు పెన్షన్ అందిస్తూ చెట్టు పన్ను మాఫీ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని ఆయన అన్నారు.గౌడ్ అన్నలకు అండగా నిలుస్తున్న కారు గుర్తుకు ఓటు వేసి సంజయ్ ని గెలిపించాలని ఆయన కోరారు వీరి వెంట గౌడ సంఘం మండల నాయకులు ఉత్కమ్ సాయ గౌడ్, సర్పంచులు శ్రీనివాస్ గౌడ్,రవి గౌడ్, గీతా కార్మికులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకే హోం ఓటింగ్

**జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు హోం ఓటింగ్ విధానాన్ని నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ఇంటినుండి ఓటు హక్కు వినియోగం సందర్భంగా శుక్రవారం రోజున జగిత్యాల, కోరుట్ల నియోజక వర్గం లలో హోం ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. మొదటి సారిగా ఎన్నికల కమీషన్ హోం ఓటింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందున కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజక వర్గాలలో 12 డి ఫారం ద్వారా హోం ఓటింగ్ కోసం 1141 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నెల 24,25 తేదీలలో 80 ఏళ్లకు మించిన వయోవృద్ధులు, 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. జగిత్యాల పట్టణంలోని గాంధీ నగర్, కోరుట్ల పట్టణంలోని 4 వ వార్డ్ లలో జరిగిన హోం ఓటింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా సెక్టో రల్ అధికారులు, సిబ్బంది, ఏజంట్లు, తదితరులు ఉన్నారు.



# 'ఖని' లో కేసీఆర్ సభ సక్సెస్

### -వేలాదిమంది జనంతో కిక్కిరిసిన సింగరేణి స్టేడియం-బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

### -సభ సక్సెస్‌తో కోరుకంటి చందర్ గెలుపు ఖాయం అంటూ ప్రజల గుసగుసలు

**సూర్య-గోదావరిఖని:**
పట్టణంలో ని సింగరేణి జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది. సీఎం కేసీఆర్ సభకు భారీగా ప్రజలు తరలిరావడంతో నాయకులకు, కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ను మరో మారు భారీ మెజార్టీతో గెలిపించండి అప్పుడే తెలంగాణ రాష్ట్రం తో పాటు రామగుండం బాగుపడుతది అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రజలను ఆలోచింపజేశాయి. బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు భారీగా రావడంతో చందర్ గెలుపు ఖాయమని ప్రజలు గుసగుసలాడుకోవడం కనిపించింది. ఈ సభలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్, పెద్దపల్లి ఎంపి వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్ రావు, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, జడ్పీటీసీ ఆముల నారాయణ, టిబిజికేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, మిరియాల రాజిరెడ్డి



రెడ్డి, నాయకులు మూల విజయ రెడ్డి, కౌశిక హరి తోపాటు పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు.

# ఏహోదాలో ఉన్నా కరీంనగర్ అభివృద్దే నా ఎజెండా

### బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్

**సూర్య, కరీంనగర్ ప్రతినిథి**
కరీంనగర్ ప్రజలే దైవంగా, కరీంనగర్ అభివృద్దే నిరంతరంగా శ్రమిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ముస్లింలను ఓట్లు అభ్యర్థించారు. కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో కలిసి నగరంలోని వివిధ మసీదుల వద్ద కరీంనగర్ అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ముస్లింలకు అందించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి, తను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే కరీంనగర్ అభివృద్ధి లో మరింత ముందుకు తీసుకువెల్తానని, ప్రస్థుతం కొనసాగుతున్న మానేరు రివర్ ఫ్రంట్ పనులు



పూర్తవుతాయని తద్వారా భారతదేశంలోనే కరీంనగర్ గొప్ప నగరంగా మారుతుందన్నారు, ఈ అభివ్రుద్ధిపై ప్రతిపక్ష పార్టీలకు, అభ్యర్థులకు అవగాహనే లేదని ఇంకా చిత్తశుద్ధితో ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి, కరీంనగర్ అభివ్రుద్ధి పట్ల పూర్తి అవగాహనతో చెప్తున్న ప్రజలకు తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు, ఎన్నికల సమయంలో మన ముందుకు వచ్చి గారడి విద్యల్లాంటి మోస పూరిత మాటలు చెప్పేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, కేవలం కరీంనగర్ అభివ్రుద్ధి, ప్రజలకు ఆహ్లాదకరమైన నగరాన్ని, అన్నిరకాల అభివ్రుద్ధులతో పాటు పేదల సంక్షేమం చూసే బీఆర్ఎస్ పార్టీకి మద్దతివ్వాల్సిందిగా కోరారు. నగరంలో హుస్సేనీపుర ఖాన్పుర పాత బజార్ జామియా మసీద్ ప్రాంతాల్లో ఎంఐఎం కార్పొరేటర్లు నాయకులు మంత్రి గంగులకు మద్దతుగా ముస్లింలను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమ్జద్ అలీ, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రెటరీ హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి యూసుఫ్, ఎంఐఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, ఎంఐఎం నాయకులు అలీ బాబా, అజర్ దబీర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాజిద్ ఖాన్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



## విస్తృతంగా ఇంటింటి ప్రచారం

**సూర్య, హుజురాబాద్**
పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో హుజురాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో టిఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్ రెడ్డి విజయం కోసం టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, మహిళా అధ్యక్షురాలు కల్లేపల్లి రమాదేవి, కౌన్సిలర్లు ఉజ్మా నూరిన్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కేసిరెడ్డి లావణ్య, ముక్క రమేష్, మంద ఉమాదేవి, ముత్యం రాజు, గనిశెట్టి ఉమామహేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, పోతరవేణి రాజ కొమరమ్మ, తొగరు సదానందం, ప్రతాప తిరుమల్ రెడ్డి, యాదగిరి నాయక్, సృజన కుమారి శివకుమార్, కొండల్ రెడ్డి, కుమారస్వామి లతో పాటు మాజీ చైర్మన్ వడ్లూరు విజయ్ కుమార్, రోశెందర్, ధనవర్ష రాజు, ఇమ్రాన్, దిల్ శ్రీనివాస్, అజయ్, సాయి కృష్ణ, మధుకర్ రావు, సమ్మయ్య, కోయల్ కార్ శ్యామ్, ధోని, మహేష్ తదితరులు ఇంటింటికి వెళ్లి పార్టీ ప్రచారం చేసి కరపత్రం అందజేసి కేసిఆర్ ప్రకటించిన పథకాలను వివరించారు. హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఇంచార్జ్ మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని విస్తృత ప్రచారం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు.

## బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల తోపులాట

**సూర్య, మెట్ పల్లి టౌన్**
పట్టణంలో పాత బస్టాండ్ లోని బిస్మిల్లా మసీదు వద్ద బిఅర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. బిస్మిల్లా మసీద్ వద్ద ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మరియు కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నరసింగ్ రావు లు ముస్లిం సోదరులకు శుక్రవారం ప్రార్థనల అనంతరం ఇరువర్గాల పార్టీల ప్రచారం నిర్వహించగా, ఇరు వర్గాల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి ఇరువర్గాల మధ్య ఏలాంటి గొడవలు జరగకుండా ఇరువర్గల కార్యకర్తలను చెదరగొట్టారు.

## పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్ రావాలి

### -కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమళ్ళ అశోక్

**సూర్య, జమ్మికుంట రూరల్**



పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ ను గెలిపించాలని కోరుతూ జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో శుక్రవారం జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ఇంటింటా పరిచయం చేస్తూ మన బ్రతుకులకు భరోసా కాంగ్రెస్ పార్టీ అని చేతి గుర్తుపై ఓటు వేసి మీ భవిష్యత్తును మార్చుకోవాలని కోరారు. నిరంకుశ, రాచరిక బిఆర్ఎస్ పాలనను అంతమొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజ్, నాయకులు ఖలీం, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## జయభేరి సక్సెస్ కాంగ్రెస్ గెలుపుకు చిహ్నాం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గం జమ్మికుంటలో గురువారం నిర్వహించిన విజయభేరి సభ సక్సెస్ ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి చిహ్నం అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జమ్మికుంట సభ సక్సెస్ బిజెపి, టిఆర్ఎస్ పార్టీలకు ఇబ్బంది ఎదురవుతుందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్న విషయం దీనితో స్పష్టమైందని అన్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిలను ఓడిస్తారని అన్నారు. నీతి, నిజాయతికి మారుపేరైనా ప్రణవ్ బాబు కు ప్రజలు పట్టం కడతారని అన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి కిరణ్, పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు, మహిళ అధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.




## హత్యాయత్నం కేసులో జైలు శిక్ష

**సూర్య బోయిన్ పల్లి**
పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని హత్యాయత్నం చేసిన వ్యక్తి కి వేములవాడ కోర్టు మూడు నెలల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే బోయినపల్లి మండలం నీలోజు పల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి వెంకటేష్ తన భార్యతో తరచూ గొడవపడుచుండగా అదే గ్రామానికి చెందిన కొనుకటి లచ్చిరెడ్డి భార్య భర్తల మధ్య వివాదాన్ని సద్దుమనగాచడానికి పంచాయితీ ఏర్పాటు చేయడంతో కక్ష పెంచుకున్న వెంకటేష్ 14.01.2022 రోజున మధ్యాహ్నం సమయంలో కొనుకటి లచిరెడ్డి ఇంటిలోకి ప్రవేశించి దాడి చేసే నేపథ్యంలో అడ్డుగా వచ్చిన లచ్చిరెడ్డి భార్య యాదమ్మ పై గుడ్డలితో దాడి చేయగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ బన్సీలాల్ విచారణ జరిపి చార్జ్ షీట్ దాఖలు చేశారు.సి ఎం ఎస్ ఎస్. ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సంజీవరెడ్డి ,మధు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కాగా వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి రవీందర్ మూడు నెలలు జైలు శిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా విచారణ అధికారి సి. ఐ బన్సీలాల్, రురల్ సి. ఐ కృష్ణ కుమార్, ఎస్.ఐ శ్రీకాంత్,హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి,కానిస్టేబుల్ జి. మధుసూదన్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

## బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి జగ్గారావుపల్లి ఎంపిటిసి రాజీనామా

**సూర్య, బోయినపల్లి**



బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి జగ్గారావుపల్లి ఎంపిటిసి కొంకటి శిరీష మదుకర్ రాజీనామా చేశారు.తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అదేవిధంగా బిఆర్ఎస్ లో ఎస్సీ లకు ప్రాముఖ్యత లేకపోవడం అదేవిధంగా కొందరు పార్టీ లో ఓంటెద్దు పోకడలకు పోతున్నారని.. వారు అవలంబిస్తున్న తీరుతో నిరాశ చెందిన తను బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.

## అనుమతి లేదు డీజే లకు.

### ఎస్ ఐ.సుధాకర్.

**సూర్య. ఇల్లంతకుంట**



మండలంలోని ఏ గ్రామంలో ఎవరికి కూడా డీజే లు పెట్టడానికి అనుమతి లేదని ఎస్సై డి. సుధాకర్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్లో డీజే యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనుమతి లేని డీజే లు పెట్టినా వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోనే డి జే యజమానులను బైండ్ఓవర్ చేసినట్లు గర్తు చేశారు. అతిక్రమించి డి జే లు పెట్టినట్లు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ సిబ్బంది, డి జే యజమానులు వున్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిన యువకులు

**సూర్య,రాయికల్**



రాయికల్ మండల అయోధ్య గ్రామానికి చెంది న 20 మంది యువ కు లు సర్పంచ్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో, కిష్టం పెట్ గ్రామానికి చెందిన 15 మంది యువకులు బి అర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యం లో బి అర్ ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరగా,ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేసి,తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు,మండల, గ్రామ నాయకులు యువకుల్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అభ్యర్థులకు జగిత్యాల పట్టణ ఓటర్లే కీలకం...!

**- నియోజకవర్గంలో సగం మంది ఓటర్లు ఇక్కడే - అభ్యర్థుల గెలుపోటములు ప్రభావితం చేసేది వారే**

**సూర్య జగిత్యాల**

జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్న వారి గెలుపు ఓటముల్లో జగిత్యాల పట్టణ ఓటర్లు కీలకంగా మారనున్నారు. నియోజకవర్గంలో అధికారులు తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 231468 ఉండగా అందులో దాదాపు సగం మంది జగిత్యాల అర్బన్ లో ఉన్నారు. ఇక్కడ మెజారిటీ ఓట్లు దక్కించుకునే వారు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయం అన్న చర్చ కొనసాగుతుంది. జగిత్యాల నియోజకవర్గంలో జగిత్యాల అర్బన్‌లో పురుషులు 46829, మహిళలు 48851, ఇతరులు 14 మంది మొత్తం 95694 మంది ఓటర్లు ఉన్నారు. జగిత్యాల పట్టణంలో ఎక్కువగా మున్నూరు కాపు,

| Name of mandal | Male | Female | Third Gender | Total |
|---|---|---|---|---|
| Raikal | 24312 | 26970 | 2 | 51284 |
| Beerpur | 8118 | 8844 | 0 | 16962 |
| Sarangapur | 9556 | 10303 | 0 | 19859 |
| Jagtial Rural | 22905 | 24760 | 4 | 47669 |
| Jagtial Urban | 46829 | 48851 | 14 | 95694 |
| Grand Total | 111720 | 119728 | 20 | 231468 |

పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. వీరి ఆశీస్సులు పొందే వారి గెలుపు ఖాయం అనే వాదన వినిపిస్తుంది. తర్వాత రాయికల్ మండలం లో పురుషులు 24312, మహిళలు 26970, ఇతరులు 2 మొత్తం 51,284 మంది ఓటర్లు ఉన్నారు. రాయికల్ పట్టణంలో పద్మశాలీలు ఎక్కువగా ఉన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తో పాటు రాయికల్ లో పద్మశాలీ ల ఓట్లు సాధించుకునే వారు విజేతగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. జగిత్యాల రూరల్ మండలంలో పురుషులు 22905, మహిళలు 24760, ఇతరులు 4 మొత్తం 47669 మంది ఓటర్లు ఉన్నారు. సారంగాపూర్ లో పురుషులు 9556, మహిళా ఓటర్లు 10,303 మొత్తం 19859 మంది ఉన్నారు. నియోజకవర్గంలో అత్యల్పంగా ఓటర్ల సంఖ్య బీర్పూర్ మండలంలో ఉంది. ఇక్కడ పురుషులు 8118, మహిళలు 8844 మొత్తం 16962 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం మొత్తంలో పురుష ఓటర్లు 111720 ఉండగా మహిళలు 119728 మంది, ఇతరులు 20 మంది ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో బి ఆర్ ఎస్



నుండి ప్రస్తుత ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి రాజకీయ అనుభవం, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ఓటర్ల మనసులు గెలిచే ప్రయత్నంలో సఫలీకృతం అవుతున్నారని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బి జీ పి నుండి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, బొగ శ్రావణి బరిలో ఉండగా యూత్ క్రేజ్, బి ఆర్ ఎస్, కాంగ్రెస్ లలో అసంతృప్తులు, బిసి ల ఓట్లు తమకు అనుకూలించనున్నాయని గెలుపు తమ దే అని ఆ పార్టీ అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి వారే గెలుపు మాదే అని బలంగా విశ్వసిస్తున్న తరుణంలో జగిత్యాల ఎమ్మెల్యే స్థానం ఎవరి కైవసం కానుందో డిసెంబర్ 3 వరకు వేచి చూడాల్సి ఉంది

# దుర్మార్గుడు, అవినీతిపరుడు, దౌర్జన్యకారుడు బండి సంజయ్

**- రాజకీయంగా ఎదుర్కోలేక సీబీఐ, ఈడీ, ఐటీలను ఉసిగొల్పడు**

**- నా కుటుంబాన్ని సైతం వేధించిన వ్యక్తి బండి**

**- ఎన్నికల ప్రచారంలో మంత్రి గంగుల కమలాకర్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



రాజకీయ ప్రత్యర్థులు రాజకీయంగా తలపడాలి కానీ బండి సంజయ్ లాంటి దుర్మార్గ రాజకీయ వేత్త తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి తన కుటుంబాన్ని వేదించాడని మంత్రి గంగుల కమలాకర్ తీవ్రంగా ఆక్షేపించారు. కరీంనగర్ నియోజకవర్గంలో చేసిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ గతంలో తన కుటుంభం ఊర్లో లేనప్పుడు, పిల్లలతో కలిసి దుబాయ్లో ఉన్నప్పుడు తన ఇంటిపై దాడి చేసి, తాళాలు పగలగొట్టి, ఇంటిని దౌర్జన్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తన చేతిలో ఉందని సీబీఐ, ఈడీ, ఐటీలతో అహంకారంతో దుర్మార్గంగా దాడి చేయించారని, బాధతో నేడు ఆ విషయాన్ని చెపతున్నానన్నారు. బండి లాంటి దుర్మార్గునికి, అవినీతి పరునికి ఓటేద్దామా అని ప్రశ్నించారు, ప్రజల నుండి వద్దు అని పెద్ద ఎత్తున నినాదాలు వినిపించాయి. బండి సంజయ్ లాంటి ఎందరు కుయుక్తులు పన్నినా... తనను కడుపులో పెట్టుకొని కాపాడుతున్న కరీంనగర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని, ఈ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.మరింతగా కరీంనగర్ అభివృద్ధితో వారికి సేవ చేసుకుంటానన్నారు..



# అభివృద్ధి కావాలా...?అభివృద్ధి నిరోధకులు కావాలా...?

**- ధర్మపురి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్**

**సూర్య వెల్గటూర్**

అభివృద్ధి చేసే బిఆర్ఎస్ కావాలో..?అభివృద్ధి నిరోధకులుగా ఉన్న కాంగ్రెస్ కావాలో..?ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మపురి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.శుక్రవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని మొక్కటావుపేట, ముత్తునూర్, రాంనూర్, చెగ్యం,తల్లకొత్తపేట గ్రామాల్లో ప్రజా ఆశీర్వాదా ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా మహిళలు ఆయనకు మంగళ హారతులు బతుకమ్మలతో బ్రహ్మరథం పట్టారు ఈ సందర్భంగా మంత్రి మహిళలతో కలిసి గులాబీల జెండా లే రామక్క.. అనే పాటకు నృత్యం చేశారు అనంతరం ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ..గత యాభై ఏళ్లు పరిపాలించిన ప్రభుత్వాలా హయాంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో తలపున గోదావరి ఉన్నా కూడా తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడే వారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంటింటికి తాగు నీటి తో పాటు సాగు నీటితో తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగల మారిందన్నారు.ఈ సాగునీటి ద్వారా తెలంగాణ రాష్ట్రం లో 3కోట్ల 20 లక్షల మెట్రిక్ టన్నుల పంటలు పండించమన్నారు.అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పంట శిస్తూ,నీటి పన్ను రద్దు చేసిన ఏకైక సీఎం మన కేసీఆర్ కాదా..? అని అన్నారు.



రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, కేసీఆర్ కిట్టు, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ,రెసిడెన్షియల్ పాటశాలలు వంటివి ఒక్కటి కూడా కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ప్రజలు అండగా నిలవాలని అభ్యర్థించారు. అనంతరం పాశి గామ గ్రామనికి చెందిన యువకులు గండ్ర విష్ణు వర్ధన ఆధ్వర్యంలో మంత్రి కొప్పుల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అలాగే ఎండపల్లి మండలం పడకల్ గ్రామనికి చెందిన మాల సంఘం సభ్యులు సుమారు 200 మంది మంత్రి సమక్షంలో చేరారు.వారికి బి ఆర్ ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గండ్ర రంగారావు, సుధీర్ రావు, నర్సింగరావు,పోనుగోటి రామ్మోహన్ రావు, రాంచెందర్ రావు,విష్ణు వర్ధన్ రావు,కనపర్తి సుధాకర్ రావు, జడ్పీటిసి బి సుధారాణిరామస్వామి,వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్,సర్పంచ్ లు ఆగండ్ల తిరుపతి, అనుమాల తిరుపతి, రామిల్ల లావణ్య సనీల్,ధ్యావనపల్లి లక్ష్మి ఎల్లయ్య,కొప్పుల విద్యాసాగర్, ఎంపిటిసి మూగల రాజేశ్వరి సత్యం,ఆర్బిఎస్ అధ్యక్షుడు చుక్క శంకర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు చల్లురి రాంచెందర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల సురేష్, నాయకులు కూస మధుకర్, కొప్పుల రత్నం,గాజుల బానేశ్, తరాళ్ల రమేష్,కుశనపల్లి రాజేష్,శ్రీధర్,గాధం భాస్కర్,సంగెపు అశోక్, తదితరులు



# ఓట్ల కోసం నేతల పాట్లు

**సూర్య-పెద్దపల్లి టౌన్**



పెద్దపల్లి లో మసీదు వద్ద ఎమ్మెల్యే అభ్యర్థులు ఓట్ల కోసం పాట్లు పడ్డారు. ముస్లింల ఓట్ల కోసం మసీదు ల వద్ద వివిధ పార్టీల అభ్యర్థులు వేచిచూశారు. నమాజ్ అనంతరం వారిని కలిసి ఓటు వేయాలని కోరారు. బి ఆర్ ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి, బిఎస్పీ అభ్యర్థి దాసరి ఉష లు వేరు వేరు గా మసీదు చౌరస్తా వద్ద ఓట్లు వేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయ రమణారావు కూడా తనదైన శైలిలో వేరొక చోట మసీదు వద్ద ముస్లింలు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**కెటిల్‌తో చాయ్ పోస్తూ...**

ఓ హొటల్ వద్ద కేటీల్‌తో టిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి కార్యకర్తలకు చాయి పోశారు. ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు.



**సిక్స్ కొట్టు... ఓటు పట్టు...**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ లో ప్రచారంలో భాగంగా కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి గంగుల కమలాకర్ క్రికెట్ ఆడుతూ ఓటును అభ్యర్థించారు.



**బాపు బాగున్నావా...**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లంతకుంట మండలంలో ఓటర్లను పలకరిస్తున్న మానకొండూర్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరేపల్లి మోహన్



**పతి కోసం సతి ప్రచారం**

**సూర్య మంథని**

ఇస్త్రీ చేస్తూ బిఆర్ఎస్ ఓటు అభ్యర్థన.. ఎన్నికల సమయం దగ్గర పడుతుండ డంతో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు కోరుతూ కుటుంబసభ్యులు వినూత్న రీతిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారంలో భాగంగా శుక్రవారం మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు కు మద్దతుగా ఆయన సతీమణి పుట్ట శైలజ ఓ లాండ్రీ షాపులోకి వెళ్లి ఇస్త్రీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు.